# తలపుల తలుపులు

పెమ్మరాజు సంధ్యారాణి

**రూమ్‌కి** తాళం వేసి రోడ్డు మీదకి రాగానే రాజేంద్ర కళ్ళు అప్రయత్నంగా ఎదురింటి కిటికీవేపు మళ్ళాయి.

ఆమె అక్కడే నిల్చొనుంది!

ఈ కొత్త రూమ్‌లోకి వచ్చిన వారం రోజుల్నుంచీ తను గమనిస్తూనే వున్నాడు. సరిగ్గా తను ఆఫీస్‌కి బయల్దేరే టయిమ్‌కి ఆమె వచ్చి అక్కడ నిలబడుతుంది....!

ఆమెను చూసి చిన్నగా నవ్వేడు.

ఆమె నవ్వింది.

చటుక్కున అతనికి తను రోడ్డుమీద నిలబడున్నాడనే విషయం స్ఫురణకి వచ్చింది. దాంతో బలవంతాన మనసుని అదుపులో పెట్టుకుంటూ ముందుకు నడవ సాగాడు. అతని ఆలోచనలు మాత్రం ఆమె వేపే పరుగెడుతున్నాయి....

తనా రూమ్‌లోకి వచ్చిన సాయంత్రం గేటు దగ్గర నిలబడ్డాడు పరిసరాల్ని గమనిస్తూ.

ఎదురింట్లో ఒకతను బయటికొచ్చేడు.

వెనుకే అతని భార్య అయుంటుంది.

అతనెంత నలుపో, ఆమె అంత తెలుపు.

కాకి ముక్కుకి దొండపండు!

అతని మీద ఈర్ష్య, ఆమెమీద జాలి ఒకే సారి కలిగాయి తనకి. అలాగే వాళ్ళని చూస్తూ నిలబడ్డాడు.

అతను—

కొద్ది అడుగులు వెనగ్గా ఆమె—వెళ్తున్నారు.

వాళ్ళనే చూస్తూ తను....!

చటుక్కున ఆమె వెనక్కి తిరిగి చూసింది—వెళుతూనే!

తను రెడ్ హాండెడ్‌గా ఆమెకు దొరికి పోయాడనిపించింది. తక్కున లోపలికి వచ్చేశాడు. అయినా ఆమె గురించి ఆలోచించడం మాత్రం మాన్లేదు.

బహుశా పరిస్థితుల ప్రభావం వల్ల అతన్ని చేసుకొని వుంటుంది. అందుకే అతనితో జీవితానికి రాజీ పడలేక పోతోంది....

ఈ ఆలోచన ఆమెమీద జాలి, ఆమె భర్త మీద కోపం కలిగించడంతో పాటు తనకి ఆనందాన్ని కూడా కల్గించ సాగింది.


తననామె ఆకర్షించినట్టే, ఆమెని తనూ ఆకర్షించాడు. అందుకే అలా వెనక్కి చూసింది! ఆ క్షణంలోనే తనకామె మనసు అర్థమైపోయింది. అప్పట్నుంచీ ఆమె రాజేంద్ర మనసులో తిష్ఠ వేసుక్కూర్చుంది. అందుకనే అటుగా వచ్చేప్పుడు, పోయేప్పుడు అతని కళ్ళు అప్రయత్నంగా అటు చూస్తాయి.


రోజు రోజుకీ ఆమెకీ, తనకీ మధ్య దూరం తరుగుతున్నట్లనిపించింది రాజేంద్రకి.

మొదటి రోజు వెనక్కి తిరిగి చూసింది.

రెండో రోజు కిటికీ దగ్గర నిలబడుతున్న దల్లా తనని చూస్తూనే పక్కకి తప్పుకుంది.

మూడో రోజు మనిషి పక్కకి తప్పుకోకుండా చూపుల్ని మాత్రం పక్కకి మరల్చింది....





నాల్గోరోజు తననే చూస్తూ నిలబడుంది. తనే కొద్దిగా కంగారు పడ్డాడు....

అయిదోరోజు తనకీ ధైర్యం వచ్చేసింది. చూపులు కలిశాయి....

ఇవాళ నవ్వులూ విరిసాయి....

ఇంక ఆలస్యమ్ అమృతమ్ విషమ్ అనిపించింది రాజేంద్రకి.

సాయంత్రం ఆఫీస్‌నించీ పెందరాడే ఇంటికి వచ్చేయాలి. అప్పటికి ఆమె భర్త రాడు కాబట్టి ఆమెతో మాట్లాడే అవకాశం దొరుకుతుంది....

ఈ నిశ్చయానికి రాగానే అతని పెదవుల మీద నవ్వు విరిసింది....మనసుకి సిగ్గేసింది. తియ్యటి ఆలోచన్లు మదిలో రొద చేస్తూంటే అతనికి తెలీకుండానే అడుగులు ముందుకు పడుతున్నాయి....

బస్టాప్‌కి చేరుకోగానే అతని ఆలోచన్లు చెదురు మదురు అయ్యాయి,

తోపిడి-త్రొక్కిసలాట-ఈ రోజు బస్సు ప్రయాణం అతనికి నరకంగా అనిపించేలా...

ఆఫీస్‌కి చేరుకున్న తర్వాత కూడా అతన్ని ఆలోచన్లు విడిచిపెట్టలేదు....బలవంతాన గడపసాగాడు క్షిమ్మసి-పని చేస్తున్నట్లు

నటిస్తూ....

మూడు గంటలకల్లా పర్మిషన్ తీసుకుని బయటికి వచ్చాడు.

బస్సుకోసం ఎదురు చూడాలనిపించ లేదు. ఆటోలో బయల్దేరాడు....

ఆటో ఆగగానే శబ్దానికి ఆమె బయటకి వచ్చింది. పిలుస్తున్నట్లుగా చెయ్యూపింది.

తననే అనుకుని తలుపు కళ్లై పోయాడు రాజేంద్ర.

కానీ ఇంతలో ఆటో వెళ్ళిపోవడంతో అవతల నిలబడున్న పక్కింటి కుర్రాడు కనిపించాడు.

ఆమె మళ్ళీ రమ్మన్నట్లు చెయ్యూపింది.

ఆ కుర్రాడటు పరుగెత్తాడు.

నీరసంగా కదిలాడు రాజేంద్ర.

రూమ్‌కి తాళంతీసి లోపలికి అడుగు పెట్టగానే "అంకుల్...." అంటూ పరుగెత్తుకొచ్చాడు ఇందాకటి కుర్రాడు.

"మీకు ఆ ఆంటీ ఈ కాగితాన్ని ఇమ్మన్నారు..." అంటూ చేతిలో ఆ కాగితాన్ని కుక్కేసి ఎంత వేగంగా వచ్చాడో, అంత వేగంగానూ వెళ్ళిపోయాడు.

వణుకుతున్న చేతుల్తో ఆ కాగితాన్ని విప్పేడు రాజేంద్ర.

"మా ఆయన వూళ్ళోలేరు....మీరు చీకటిపడిన తర్వాత రండి ఎదురు చూస్తూ వుంటాను..."

అతనికి ఇది కలా నిజమా? అన్నంత అనుమానం వచ్చింది. మళ్ళీ మళ్ళీ ఆ వుత్తరాన్ని చదివేడు.

వెదకబోయిన తీగ కాలికి తగిలింది....

ఆనందంతో అతని మనసు గంతులు వేయసాగింది.

ఆ వుత్తరంతో పాటు మంచం మీద వాలిపోయాడు.

ఉత్తరం....

రంగుల కలలు

ఎన్ని సార్లు ఉత్తరాన్ని చదివినా, ఎన్ని కలలు కన్నా టైమ్ గడవడం లేదు

శుభ్రంగా స్నానం చేశాడు

నీటగా డ్రస్ చేసుకున్నాడు.

ఇంకా పొద్దు గూకలేదు....

నెమ్మదిగా నడుస్తున్న టైమ్‌ని తిట్టుకుంటూ వరండాలో కుర్చీ వేసుకుని కూర్చున్నాడు.

మళ్ళీ ఆమె వాకిట్లోకి కూడా రాలేదు. బహుశా తనలాగనే ఆలోచనల్లో సతమతమై పోతోందేమో అనిపించిందతనికి.

సెకండ్లు....

నిముషాలు...

గడుస్తున్నాయి బరువుగా.

చీకట్లు కమ్ముతున్నాయి

రాజేంద్ర మొహం మాత్రం ఆనందంతో వెలిగిపోతోంది... ఆలోచనల అలలు మాత్రం అతన్ని ఇబ్బంది పెట్టేస్తూనే వున్నాయి..

"పట్టుకోండి.. పట్టుకోండి," అరుపుల్తో వులిక్కిపడి బయటికి వచ్చాడు రాజేంద్ర.

ముందొకతను పరుగెత్తుకొస్తున్నాడు.

అతన్ని పట్టుకోవడానికి వెనక చాలా మంది.

"పట్టుకోండి... పట్టుకోండి.దొంగ" అరుస్తున్నారు.

పరిస్థితి అర్థమైంది రాజేంద్రకి.

చటుక్కున రోడ్డుమీదికి వురికి అప్పుడే అక్కడికి చేరుకున్న అతన్ని గట్టిగా పట్టేసుకున్నాడు...

ఇంతలో జనం చుట్టు ముట్టేశారు

దొంగ చేతులు మారాడు.

ఎవరిష్టం వచ్చినట్లు వాళ్ళు కొట్ట సాగారు.

"ఎవరి వస్తువుల కోసమో ఆశపడకపోతే కష్టపడి పనిచేసుకోలేకదూ...?"

"ఇటువంటి దొంగ బతుకు బతికేకన్నా చావడం నయం...."

ఎవరిష్టం వచ్చినట్లు వాళ్లు తిట్టసాగారు.

రాజేంద్రకి అక్కడ నిలబడాలనిపించ లేదు. రూమ్‌లోకి వచ్చేశాడు.

పోలీస్ స్టేషన్లో అప్పజెప్పడానికి కాబోలు దొంగని బలవంతాన లాక్కెళ్ళుతూపోతున్నారు...

(సచిత్ర మాసపత్రిక)

## యాజమాన్యం, తదితర వివరాలు

ఫారం 4 (8-వ నిబంధన ప్రకారం)

| | |
|---|---|
| ప్రచురణ స్థలం | హైదరాబాదు |
| ఎంత కాలానికొకసారి | నెలకొకసారి |
| ముద్రాపకుని పేరు | పి. రామకృష్ణ |
| జాతి | భారతీయుడు |
| విలాసం | 1-8-4/1/1 చిక్కడపల్లి<br>హైదరాబాదు-500 020 |
| ప్రకాశకురాలి పేరు | శ్రీమతి వి. లీలావతి |
| జాతి | భారతీయురాలు |
| విలాసం | 3-5-1039/1 నారాయణగూడ<br>హైదరాబాదు-500 029 |
| సంపాదకురాలి పేరు | శ్రీమతి వి. లీలావతి |
| జాతి | భారతీయురాలు |
| విలాసం | 3-5-1039/1, నారాయణగూడ<br>హైదరాబాదు-500 029 |
| పత్రిక యజమానురాలు | శ్రీమతి వి. లీలావతి |

పై విషయాలు నాకు తెలిసినంతవరకు వాస్తవమైనవని తెలియజేస్తున్నాను

1-3-1982, హైదరాబాదు (సం) వి. లీలావతి

జనం, గోల క్రమంగా తగ్గింది.

రాజేంద్ర మనసులో కొత్త అలజడి రేగింది.

"దొంగ దొంగ ..." అతని చెవుల్లో మారుమ్రోగుతోంది.

అతనికీ, తనకీ తేడా ఏమిటి?

ఈ ఆలోచన ఛెళ్ళున చెంపమీద చరిచినట్టనిపించిందతనికి.

తనూ కొద్దిసేపట్లో ఎదురింట్లో దొంగతనానికి బయల్దేరబోతున్నాడు. తమ విషయన్ని ఎవరైనా పసిగట్టేరంటే...?

తనూ ఇలాగే నలుగురిముందూ అవమానాన్ని భరించాల్సి వుంటుంది. తనందుకు సిద్ధంగా లేడు..

చటుక్కున కుర్చీలోంచి లేచాడు.

గబగబా రూమ్‌కి తాళం వేసి రోడ్ మీదికి వచ్చాడు.

ఎదురింటి గుమ్మంలో ఆమె నిలబడుంది.

అటువేపు చూడాలన్నా భయమనిపించింది రాజేంద్రకి. చంచలా ముందుకి వెళ్ళిపోయాడు—రోడ్లమీద కాసేపలా అలా తిరిగివద్దామని!